సాక్షి
చిత్తూరు
శుక్రవారం । 7 । మార్చి । 2025



అవగాహనతోనే చెత్త సేకరణ సాధ్యం
ప్రజలకు అవగాహన కల్పనతోనే తడి,పొడి చెత్త సేకరణ సాధ్యమని జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు తెలిపారు. - 8లో



హెల్మెట్ ధరించండి
ద్విచక్రవాహనచోదకులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీనియర్ సివిల్ జడ్జి భారతి సూచించారు. - 8లో



సైనికుల సేవలు ఎనలేనివి
దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికుల సేవలు ఎనలేనివని రాష్ట్ర సైనిక సంక్షేమశాఖ అధికారి వీవీ రెడ్డి అన్నారు. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్రవారం (సా)	సహర్ శనివారం (ఉ)
చిత్తూరు	6-28	5-05
పుంగనూరు	6-29	5-09

న్యూస్‌రీల్

పాడి రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

ఐరాల: పాడి రైతులు ఆర్థికాభివృద్ధే తమ లక్ష్యమని జిల్లా పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జ్ జేడీ డాక్టర్ మహ్మద్ అబ్దుల్ ఆరిఫ్ అన్నారు. గురువారం మండలంలోని మద్దిపట్లపల్లె, గాజులపల్లె గ్రామాల్లో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధులకు వేస్తున్న వ్యాక్సినేషన్‌పై మద్దిపట్లపల్లె పశువైద్యాధికారి పినాకపాణిని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ జేడీ మాట్లాడుతూ పాడి పశువులు గాలికుంటు వ్యాధి బారిన పడకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సంచార పశు ఆరోగ్య వాహనం ద్వారా పశువులకు అందే వైద్యసేవలు, టోల్ ఫ్రీ నంబర్ 1962పై పశువుల పెంపకందారులు, రైతులకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. గాలికుంటు వ్యాధి నివారణకు టీకా ఒక్కటే మార్గమన్నారు. పాడి రైతుల శ్రేయస్సు దృష్ట్యా ఈ నెలాఖరు వరకు ఉచితంగా గాలికుంటు వ్యాధి టీకాలు వేయనున్నట్లు తెలిపారు.

మొరాయించిన సర్వర్



చిత్తూరు అర్బన్ కార్యాలయంలో వేచి ఉన్న క్రయవిక్రయదారులు

చిత్తూరు కార్పొరేషన్: సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సర్వర్ మొరాయించడంతో క్రయవిక్రయదారులు అవస్థలు పడ్డారు. బుధవారం నుంచి గురువారం మధ్యాహ్నం వరకు ఆన్‌లైన్ సక్రమంగా రాకపోవడంతో వినియోగదారులకు తిప్పలు తప్పలేదు. ఈసీ, మ్యారేజ్ సర్టిఫికెట్లు, రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన వినియోగదారులు చిత్తూరు అర్బన్, రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో బారులు తీరారు. రోజు రెండు కార్యాలయాల్లో 70కి పైగా డాక్యుమెంటేషన్లు జరుగుతుండగా రెండు రోజులుగా అందులో సగమే జరిగాయి. ఎప్పుడు ఆన్‌లైన్ వస్తుందా? అని వేచిచూశారు.

నెలాఖరులోపు ఎన్‌సీడీ సర్వే పూర్తి చేయండి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మార్చి నెలాఖరులోపు ఎన్‌సీడీ సర్వే పూర్తి చేయాలని డీఎంహెచ్‌ఓ సుధారాణి పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో గురువారం వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. రీప్రొడక్టివ్ చైల్డ్ హెల్త్(ఆర్‌సీహెచ్) ఐడీని, ఆయుష్మాన్ భారత్(అభ) ఐడీకి అనుసంధానం చేయాలన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను ఎప్పటికప్పుడు యాప్‌ల్లో నమోదు చేయాలన్నారు. ప్రధానమంత్రి జన్ ఔషధి యోజన కార్యక్రమంలో భాగంగా తక్కువ రేటుతో ఇచ్చే మందులను వినియోగించుకునేలా చూడాలన్నారు. ఆయుష్మాన్ వే వందన కార్డును 70 ఏళ్లకు పైబడిన వారికి అందించాలన్నారు. ఈ కార్డుతో కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా రూ.5 లక్షల వరకు ఆరోగ్య సేవలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్, డీఐఓ హనుమంతరావు, డీఎంఓ వేణుగోపాల్, వైద్యులు గిరి, ప్రవీణ, అనుష, రామ్మోహన్, జయరాముడు తదితరులు పాల్గొన్నారు.

అధిక నాణ్యత.. మంచి దిగుబడి.. తెగుళ్ల తట్టుకునే సామర్థ్యం.. ఎక్కువ కాలం నిల్వ ఉండే సుగుణం.. లాభాల పంట.. పొరుగు రైతుల స్ఫూర్తి.. ఉద్యానవన శాస్త్రవేత్తల సూచనలతో పలమనేరు ప్రాంతంలోని రైతులు కొత్త టమాట వంగడాల సాగుపై మక్కువ చూపుతున్నారు. పెట్టుబడి అధికమైన సరే కొత్త వెరైటీలనే సాగు చేయడానికి మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా ఈ సీజన్‌లో అధిక విస్తీర్ణంలో టమాట సాగు అవుతోంది.



నర్సరీలో సిద్ధంగా ఉన్న హైబ్రీడ్ రకం టమాట నారు



మల్చింగ్ సీట్‌తో నాటిన టమాట

కొత్త టమాట

నూతన వంగడాలపై రైతుల చూపు

- వేసవిలో పెరగనున్న హైబ్రిడ్ రకాల సాగు
- డ్యూయల్ పర్పస్ టమాటపై మక్కువ
- ధరలుంటే మార్కెట్‌కు.. లేదంటే ప్రాసెసింగ్‌కు సరుకు
- నెలాఖరుకల్లా 7వేల హెక్టార్లు దాటనున్న సాగు

పలమనేరు: చిత్తూరు జిల్లాలోని పడమటి ప్రాంతాల్లో ఎక్కువగా సాగయ్యే పంటల్లో టమాట ప్రధానమైంది. ప్రస్తుత రబీలో టమాట సాగుకు మార్చి నెలాఖరు వరకు అనుకూలమైన సమయం. దానికి తోడు పొరుగునే ఉన్న కర్ణాటకలో టమాట కొత్త వంగడాలతో అక్కడి రైతులు మంచి లాభాలను గడించారు. అక్కడి రైతులు స్ఫూర్తి, స్థానిక ఉద్యానశాఖ అధికారుల సూచనలతో ఈ ప్రాంతంలోనూ టమాట రైతులు కొత్త హైబ్రిడ్ వంగడాల సాగుపై మొగ్గు చూపుతున్నారు. ఇందులో ఈ దఫా డబుల్ పర్పస్ టమాట సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఎందుకంటే ధర లేనప్పుడు వీటిని ప్రాసెసింగ్ యూనిట్లకు పంపే అవకాశం ఉంటుంది. ఈ నెలలో సాగు చేసే టమాట మే 15వ తేదీ నుంచి కోతలు రానున్నాయి.

హైబ్రిడ్ రకాల్లో ఇవే టాప్...

పలమనేరు ప్రాంతంలో సంప్రదాయ రకాలైన టమాట సాగుకు రైతులు మంగళం పాడారు. ఎక్కువ ఖర్చు పెట్టినా పర్వాలేదని అధిక దిగుబడులనిచ్చే హైబ్రిడ్ వంగడాలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలోని 90 శాతం మంది రైతులు ఈ సీజన్‌లో సింజెంటా కంపెనీకి చెందిన సాహు, బాహు, ఈషా కంపెనీకి చెందిన జయహో, సెమినాష్ కంపెనీకి చెందిన అశితోస్, అభిక్, క్లాస్-బి కంపెనీకి చెందిన ముకుంద్, పీహెచ్ఎస్ కంపెనీకి చెందిన చాంపియన్, 34 సాహిత్ రకాల నారును నాటుతున్నారు.



చిన్నపేట కురప్పల్లి వద్ద గతంలో సాగైన డ్యూయల్ టమాట తోట

వీటికి మార్కెట్‌లో మంచి డిమాండ్

కొత్త వంగడాలకు మార్కెట్‌లో ఎక్కువ డిమాండ్ ఉంది. ఇవి వైరస్ తెగుళ్లను తట్టుకోవడంతో పాటు మంచి దిగుబడి, పండ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉండడంతో రవాణాకు అనుకూలంగా ఉంటాయి. పంట బాగా పండితే ఎకరానికి 2 వేల బాక్సులు (బాక్సు 15కిలోలు) దిగుబడి వచ్చే అవకాశం ఉంది. అందుకే ఎక్కువ మంది రైతులు ఈ వెరైటీల వైపు మొగ్గు చూపుతున్నారు. అంతేకాక ఇవి టమాట ప్రాసెసింగ్‌కు అనుకూలమైన రకాలు. కోతల సమయంలో ధర లేకుంటే వీటిని సుదూర ప్రాంతాల్లోని టమాట ప్రాసెసింగ్ యూనిట్లకు పంపే వీలుంటుంది. ప్రాసెసింగ్ యూనిట్లలో టమాట జ్యూస్, పౌడర్ లాంటివి తయారు చేసి నిల్వ ఉంచుకోవచ్చు. మ్యాంగో ప్రాసెసింగ్ లాగే టమాట ప్రాసెసింగ్ చేసుకోవచ్చు. తద్వారా ధరలున్నప్పుడు జ్యూస్, పౌడర్లను పెద్ద కంపెనీలకు అమ్ముకునే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో రైతులు నష్టాలు రాకుండా డ్యూయల్ పర్పస్ వంగడాల సాగుపై మొగ్గు చూపుతున్నారు.

పలమనేరు డివిజన్‌లో సాగు వివరాలివీ..

రబీ సాధారణ సాగు:	5 వేల హెక్టార్లు
ఈ ఏడాది సాగు:	7 వేల హెక్టార్లు
రైతుల సంఖ్య:	సుమారు 10 వేలమంది

హైబ్రిడ్ సాగుకు పెరిగిన పెట్టుబడులు

ఎకరాలో పంట సాగుకు 7వేల మొ క్కలు ఒకరూపాయి వంతున రూ.7 వేలు, దుక్కి, ఎరువులకు రూ.50 వేలు, స్టిక్‌లు, మల్చింగ్ పేపర్‌కు రూ.లక్ష, ఆపై క్రిమిసంహారక మందులు, ఎరువులకు రూ.50 వేలు చొప్పున, ఇతరఖర్చులు మొత్తం కలిపి రూ.2.50 లక్షల పెట్టుబడి పెట్టాలి. ఎకరానికి పంట దిగుబడి బాగా వస్తే 2 వేల బాక్సుల దిగుబడి వస్తుంది. బాక్సు ధర రూ.400గా ఉంటే రూ.8 లక్షలు, రూ.300గా ఉంటే రూ.6 లక్షలు రైతుకు వస్తుంది. దీంతో ఖర్చుపోనూ సుమారు రూ.3.50 లక్షల నుంచి రూ.4.50 లక్షల వరకు ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు.

కొత్త వెరైటీలతో అధిక దిగుబడులు



నేను మూడెకరాల్లో హైబ్రిడ్ టమాట సాగుచేశాను. మళ్లీ రెండెకరాలు ఇప్పుడు సాగు చేస్తా. పంట దిగుబడి బాగా వస్తుంది కాబట్టే హైబ్రిడ్ రకాలను సాగు చేస్తున్నా.గత మూడేళ్లుగా కర్ణాటకలో వైరస్ తెగుళ్ల కారణంగా ఈ దఫా టమాట సాగు భారీగా తగ్గింది. దీంతో ఈ దఫా ధరలు బాగుంటాయనే నమ్మకం ఉంది. ప్రభుత్వం డ్రిప్‌నకు రాయితీ ఇచ్చినట్టే మల్చింగ్ పేపర్, డిప్ ఎరువులకు రాయితీ ఇస్తే బాగుంటుంది.
– రవి, కూర్మాయి, రైతు, పలమనేరు మండలం

రైతులు అప్‌డేట్‌గా ఉండాలి



పాత రకాలు కాకుండా కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త వంగడాల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చర్ రీసెర్చ్ (ఐఐహెచ్ఆర్) బెంగళూరు, ద ఎక్స్‌టెన్షన్ సెంటర్ ఆఫ్ నేషనల్ హార్టికల్చర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ సంస్థలు కొత్త వంగడాలను పరిచయం చేశాయి. ముఖ్యంగా డ్యూయెల్ టైప్ టమాట సాగును పెంచుతున్నాం. స్థానిక మార్కెట్లకు, ధర లేదంటే ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలకు తరలించుకోవచ్చు. –కోటేశ్వరావు, హార్టికల్చర్ ఏడీ, పలమనేరు డివిజన్

మహోఘని..లాభాల ధ్వని

- కుప్పంలో మొదలైన మొక్కల పెంపకం
- 20 మంది వరకు సాగు చేస్తున్న రైతులు
- 12 ఏళ్లకు కోతకు రానున్న చెట్లు
- సాగు ఖర్చుల భయం ఉండదు
- మార్కెట్‌లో మంచి డిమాండ్



ఫారెస్టు నర్సరీలో పెరుగుతున్న మహోఘని చెట్లు

కుప్పం రూరల్ : ఎప్పుడూ పంట ప్రయోగాల్లో ముందుండే కుప్పం రైతుల చూపు ఇప్పుడు మహోఘని పంట వైపు పడింది. ఎక్కడో అమెరికాలో పుట్టి ఉత్తరాంధ్రలో పెరుగుతున్న ఈ పంటను సాగు చేయడానికి కుప్పం రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే కుప్పం నియోజకవర్గంలో 20 మంది రైతులు తమ పొలం గట్లపై సాగు చేపడుతున్నారు. 12 సంవత్సరాల తరువాత చెట్టుకు రూ.60 వేలకు పైగా ఆదాయం వస్తుండడంతో రైతులు మహోఘని సాగుకు ఆసక్తి చూపుతున్నారు. పంటల సాగులో నిత్యం ప్రయోగాలు చేపట్టే కుప్పం రైతులు ఇప్పుడు మరో ప్రయోగానికి శ్రీకారం చుడుతున్నారు. టేకు గృహోపకరణాల్లో అధికంగా ఉపయోగిస్తుంటారు. టేకు అంతటి మన్నిక ఉండి తక్కువ ధరకు లభించే మహోఘనిని మాత్రం ఎవరూ పట్టించుకోరు. కానీ కుప్పం రైతులు మాత్రం ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల్లో చూసి మహోఘని సాగు చేపడుతున్నారు. ఫేస్‌బుక్‌లోనే ఆర్డర్లు పెట్టుకుని చెట్లను తెప్పించుకుంటున్నారు. ఒక్కో చెట్టు రూ.100 నుంచి రూ.150 వరకు ఉంటుంది. ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్ చేసి పొలం గట్లకు చేరుస్తున్నారు. ఇప్పటికే కుప్పంలో 20 మంది రైతులు ఈ ప్రయోగాత్మక పంటను సాగు చేపడుతున్నారు.

వంద చెట్లను కాపాడుకుంటే..

ఒక్కో మహోఘని చెట్టు 12 ఏళ్ల తరువాత పూర్తిస్థాయి పక్వానికి వస్తుంది. 60 నుంచి 80 అడుగుల ఎత్తు మేర ఈ చెట్టు వల్ల సరాసరిన 40 క్యూబిక్ అడుగుల కలప వస్తుంది. మార్కెట్‌లో ఒక్కో క్యూబిక్ అడుగు 1500 నుంచి 2500 వరకు ధర పలుకుతుండడంతో రైతులు 12 ఏళ్ల తరువాత ఒక్కో చెట్టు నుంచి 60 వేలకు పైగా ఆదాయం వస్తోంది. ఒక్కో చెట్టు నుంచి 5 కేజీల విత్తనాలు వస్తాయి. ఒక్కో కిలో విత్తనం వెయ్యి రూపాయల ధర పలుకుతుంది. దీని పూలకు సైతం తమిళనాడు, కర్ణాటక మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. వంద చెట్లను 12 ఏళ్లపాటు కాపాడు కుంటే రూ.50 లక్షలకుపైగా ఆదాయం రానుంది. ఇంతటి ఆదాయం ఉందని గ్రహించిన కుప్పం రైతులు మహోఘని సాగు వైపు అడుగులు వేస్తున్నారు.



పొలం గట్టుపై మహోఘని మొక్క నాటుతున్న రైతు స్వామినాథన్



రైతు నాటేందుకు కొనుగోలు చేసిన చెట్లు

రైతులకు రాయితీపై ఇస్తాం

రైతులు ఎవరికైనా మహోఘని మొక్కలపై ఆసక్తి ఉంటే తాము పెంచి ఇస్తాం. ఫారెస్ట్ నర్సరీలో అక్కడక్కడా పెంచేందుకు బయటి నుంచి తెప్పించాం. రైతులు కావాలని ముందుగా ఆర్డర్ ఇస్తే 50 శాతం రాయితీపై సరఫరా చేస్తాం. మహోఘనికి మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. వీటిని గృహోపకరణాల తయారీతో పాటు ఈ చెక్కతో దేవతా మూర్తుల ప్రతిమలు ఎక్కువగా చేస్తారు. వీటికి తమిళనాడు, కర్ణాటకలో ఎక్కువ డిమాండ్ ఉంది.
– జయశంకర్, ఫారెస్ట్ రేంజర్, కుప్పం

ప్రయోగాత్మకంగా చేపడుతున్నాం

నేను ఫేస్‌బుక్‌లో మహోఘని సాగు గురించి చూశా. దీనిపై వాకబు చేస్తే ఇప్పటికే మా చుట్టు పక్కలే కాకుండా నియోజక వర్గం మొత్తం 20 మంది రైతులు మహోఘని సాగు చేపడుతున్నట్లు తెలిసింది. నేను ఫేస్‌బుక్‌లో ఆర్డర్ పెట్టి 50 మొక్కలను కొనుగోలు చేశా. ఒక్కో చెట్టు రూ.150 వరకు రేటు ఉంది. పొలం గట్లపై నాటుకున్నాం. నీరు తప్ప సాగు ఖర్చులు ఏమీ ఉండవు. 12 ఏళ్ల తరువాత కోతకు వస్తుందంట. లాభాలు బాగా ఉంటాయని చెబుతున్నారు.
– స్వామినాథన్, రైతు, పలవరిగానిమిట్ట

12న వైఎస్సార్‌సీపీ ఫీజు పోరు

- వేలాది మందితో కలెక్టరేట్ల వద్ద ధర్నా
- విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం
- జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పిలుపు



మాట్లాడుతున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 12వ తేదీన జరిగే 'వైఎస్సార్‌సీపీ ఫీజు పోరు'ను విజయవంతం చేయాలని ఆ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి వైఎస్సార్‌సీపీ పార్టీ విద్యార్థి విభాగం నియోజకవర్గాల అధ్యక్షులతో తుమ్మలగుంటలోని చంద్రగిరి నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఆయన సమావేశమయ్యారు. ఫీజు పోరు కార్యక్రమానికి అన్ని ప్రయివేటు విద్యాసంస్థల యజమాన్యాలు కూడా సహకరించాలన్నారు.

చిత్తూరు, తిరుపతి కలెక్టరేట్ల వద్ద నిరసన

వైఎస్సార్‌సీపీ ఫీజుపోరును చిత్తూరు, తిరుపతి కలెక్టర్ కార్యాలయాల వద్ద విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన చేపట్టనున్నట్టు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి తెలిపారు. చిత్తూరు కలెక్టర్ కార్యాలయం వద్ద కుప్పం, పలమనేరు, పుంగనూరు, పూతలపట్టు, జీడీ నెల్లూరు, చిత్తూరు నియోజకవర్గాల విద్యార్థులు, తిరుపతి కలెక్టరేట్ వద్ద సత్యవేడు, శ్రీకాళహస్తి, తిరుపతి, నగరి, చంద్రగిరి, వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గాల విద్యార్థులు నిరసన చేపట్టనున్న తెలిపారు. ఈ కార్యక్రమాలకు ఎంత మంది విద్యార్థులు రాగలరన్న సమాచారం ఈనెల 10వ తేదీకి సేకరించాలని సూచించారు. అనంతరం అన్ని నియోజకవర్గాల వైఎస్ఆర్ విద్యార్థి విభాగం నూతన అధ్యక్షులను శాలువలతో సత్కరించారు. రాష్ట్ర విద్యార్థి విభాగం నాయకులు ఓబుల్‌రెడ్డి, చిదిల్యాలసరెడ్డి, శశి, ఎన్‌వీ.సురేష్, పవన్‌కుమార్, డీ.లోకేష్, బీ.హరి, మహేష్, చెంగల్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వినోద్, యుగంధర్, రాజశేఖర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, హరికుమార్ పాల్గొన్నారు.





అరుణోదయం.. తుషార శోభితం

సూరీడు ఉదయించే సమయం.. నిత్య శోభితమే. దానికితోడు వేసవి ప్రారంభమైనా ఇంకా వీడని మంచు తెరలను చీల్చుకుంటూ ఆవిష్కృతమైన అరుణోదయం ప్రకృతి రమణీయ కావ్యమైంది. పుంగనూరు పట్టణ శివారులో గురువారం ఉదయం మంచుమేఘాల నడుమ కనినిపించిన సూర్యుడు దృశ్యం పట్టణ ప్రజలను ఆకట్టుకుంది.
– పుంగనూరు

నోటీస్ బోర్డు

జాతీయ లోక్ అదాలత్ రేపు


మాట్లాడుతున్న జడ్జి భారతి

చిత్తూరు అర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా శనివారం జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్.భారతి కోరారు. చిత్తూరులోని న్యాయస్థానాల సముదాయంలో ఉన్న న్యాయసేవా సదన్ భవనంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 8వ తేదీన ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే అదాలత్‌లో కేసుల పరిష్కారం కోసం చిత్తూరు, తిరుపతి, మదనపల్లె ప్రాంతాల్లో న్యాయమూర్తులతో కలిసి 32 బెంచ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే ఉచిత లోక్ అదాలత్ ద్వారా 300 కేసుల వరకు పరిష్కరించామన్నారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవడమే అదాలత్ లక్ష్యమన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జాతీయ సైన్స్ డే..

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాస్థాయిలో ఈ నెల 8వ తేదీన జాతీయ సైన్స్‌డే నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి అరుణ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల నిర్వహించాల్సిన జాతీయ సైన్స్ డే జిల్లాస్థాయి కార్యక్రమం పలు కారణాలతో వాయిదా పడిందన్నారు. ప్రస్తుతం ఈ నెల 8వ తేదీన జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

మహిళా దినోత్సవం..

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 8 వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం, కళాశాల 43వ వార్షిక వేడుకలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ మనోహర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శనివారం తమ కళాశాలలో నిర్వహించే కార్యక్రమానికి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి విచ్చేస్తారన్నారు. అలాగే చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావ్, ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, సీపీడీసీ సెక్రటరీ వెంకటేశ్వరచౌదరి విచ్చేస్తారన్నారు.

నేడు మొగిలీశ్వరుడి హుండీ లెక్కింపు

బంగారుపాళెం: మొగిలి గ్రామంలోని మొగిలీశ్వరస్వామి ఆలయంలో ఉన్న హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించనున్నట్లు ఈఓ మునిరాజ తెలిపారు. మొగిలీశ్వరాలయ ఆవరణలో ఉదయం 10 గంటలకు దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో హుండీ లెక్కింపు చేపట్టనున్నట్లు చెప్పారు.

డీఈ కార్యాలయం మార్పు

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక గాంధీరోడ్డులోని ట్రాన్స్‌కో డీఈ కార్యాలయాన్ని గురువారం మార్పు చేశారు. రెడ్డిగుంట ఏఈ కార్యాలయ భవనంలోకి మార్చారు. ఎస్ఈ ఇస్మాయిల్అహ్మద్ ఉదయం పూజలు చేసి, రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ డీఈ కార్యాలయ పరిధిలోకి రెడ్డిగుంట, గుడిపాల, చిత్తూరు రూరల్, పూతలపట్టు సెక్షన్లు వస్తాయి. వినియోగదారులు ఈ మార్పును గమనించాలని ఈఈ మునిచంద్ర, డీఈ ఆనంద్ కోరారు. ఈఈలు జగదీష్, సురేష్, డీఈలు ప్రసాద్, శేషాద్రిరెడ్డి, ఏఈ విశ్వప్రసాద్ పాల్గొన్నారు.

ఖాతాల్లో నగదు డ్రా.. మెసేజ్‌లు

- ఆందోళనలో ఖాతాదారులు
- చిత్తూరు జిల్లా రొంపిచెర్ల ఎస్‌బీఐలో ఘటన
- మాకు సంబంధం లేదు : మేనేజర్ భాస్కర్


బ్యాంకు వద్దకు చేరుకున్న ఖాతాదారులు

రొంపిచెర్ల: స్థానిక భారతీయ స్టేట్ బ్యాంక్‌లో తమ ప్రమేయం లేకుండా నగదు డ్రా అయినట్టు పలువురు ఖాతాదారులకు మెసేజ్‌లు రావడంతో వారు ఆందోళనకు గురయ్యారు. బుధవారం రాత్రి పలువురు ఖాతాదారులకు నగదు డ్రా అయినట్టు మెసేజ్‌లు రావడంతో వారంతా గురువారం బ్యాంకు వద్దకు పరుగులు తీశారు. మండలంలోని మోటుమల్లెల గ్రామానికి చెందిన ప్రసాద్ ఖాతాలో రూ.3,600, గానుగచింతకు చెందిన శిద్దులయ్య ఖాతాలో రూ.2,160, రొంపిచెర్లకు చెందిన యాస్మిన్ ఖాతాలో రూ.5వేలు, బొమ్మయ్యగారిపల్లెకు చెందిన అబ్బుల్ రహిమాన్ ఖాతాలో రూ.1,650, రామచంద్రాపురం కాలనీకి చెందిన ఫరీదా ఖాతాలో రూ.4,650, రొంపిచెర్లకు చెందిన చంద్రశేఖర్ ఖాతాలో రూ.10 వేలు డ్రా అయినట్టు వారి సెల్‌ఫోన్లకు బుధవారం రాత్రి మేసేజ్‌లు వచ్చాయి. వారంతా గురువారం బ్యాంకు వద్దకు చేరుకుని తాము డ్రా చేయకనే డ్రా చేసుకున్నట్టు మెసేజ్‌లు ఎలా వచ్చాయని మేనేజర్ బాలే భాస్కర్‌ను ప్రశ్నించారు. ఖాతాదారులు వివిధ బ్యాంకులు, ప్రైవేటు కంపెనీల్లో రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించకపోతే వారి ఖాతా నుంచి రూ.290 అదనంగా వసూలు చేస్తారని తెలిపారు. ఇలాంటి నిధులు గత మూడు, నాలుగు సంవత్సరాలకు చెందిన అపరాధ రుసుం ఒక్కసారిగా డ్రా చేసి ఉండవచ్చని తెలిపారు. దానికి తమ బ్యాంకుకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఖాతాదారులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాతానని మేనేజర్ తెలిపారు. ఇలా రెండురోజులుగా మండలంలోని సుమారు 130 మంది ఖాతాల్లో నగదు డ్రా అయినట్టు సమాచారం.

డ్వాక్రా రుణాలు ఎలా కట్టాలి



పాల డెయిరీ నుంచి నా బ్యాంక్ ఖాతాలో డబ్బు పడింది. ఆ డబ్బుతో పాడి ఆవు కొనుగోలుకు స్వయం సహాయక సంఘాల్లో తీసుకున్న రుణం చెల్లించాలి. ఖాతాలో ఉన్న డబ్బు గురువారం ఉదయం డ్రా అయినట్లు సెల్‌ఫోన్‌కు మేసేజ్ వచ్చింది. ఇప్పుడు 24 గంటల్లో డ్వాక్రా సంఘానికి డబ్బులు ఎలా కట్టాలి. కూలి నాలి చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్న మాకు న్యాయం చేయండి. – ఫరీదా, ఖాతాదారు

ఇది మంచి పద్ధతి కాదు



ఖాతాల్లో ఉన్న డబ్బు తెలియకుండానే డ్రా చేయడం మంచి పద్ధతి కాదు. అపరాధ రుసుం పేరుతో ఖాతాదారులను మోసం చేస్తున్నారు. ఐదేళ్లుగా డ్రా చేయని డబ్బును ఇప్పుడు ఒకసారిగా ఎలా డ్రా చేస్తారు. బ్యాంకులు, ప్రైవేటు కంపెనీలు ఖాతాదారుల నడ్డి విరచడం భావ్యం కాదు. అవసరాల కోసం ఖాతాల్లో డబ్బు పెట్టుకోవడం కూడా నేరమేనా?.

– ప్రసాద్, ఖాతాదారు

మరణంలోనూ వీడని బంధం

- నిన్న తమ్ముడు..నేడు అన్న మృత్యువాత
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మునికుమార్ మృతి
- విషాదచాయలో గట్టు గ్రామం


మునికుమార్ మృతదేహం


బాధితులతో మాట్లాడుతున్న డీఎస్పీ, సీఐ

విజయపురం : మరణంలోనూ ఆ అన్నదమ్ముల బంధం వీడలేదు. పుత్తూరు–చెన్నై జాతీయ రహదారి పిళ్లారిపట్టు వందనవైన్స్ సమీపంలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, తిరుపతిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మునికుమార్ (20) గురువారం మరణించాడు. బతికి వస్తాడనుకున్న పెద్ద కుమారుడు కూడా మృతి చెందడంతో తల్లిదండ్రులు ఆస్పత్రి వద్దే కుప్పకూలిపోయారు. తల్లిదండ్రులకు కొరివి పెట్టాల్సిన ఇద్దరు బిడ్డలకు తండ్రే కొరివి పెట్టాల్సిరావడం గట్టు గ్రామాన్ని శోకసంద్రంలో ముంచేసింది.

ఆగ్రహంతో గ్రామస్తుల ధర్నా

రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి చెందడంతో గ్రామస్తులు ఆగ్రహంతో పుత్తూరు పట్టణం అంబేడ్కర్ సర్కిల్ వద్ద రోడ్డుపై ధర్నా చేపట్టారు. ప్రమాదానికి కారకుడైన డ్రైవర్‌ను వెంటనే అరెస్టు చేయాలని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో రోడ్డుపై రాకపోకలు నిలిచిపోయింది. వెంటనే పుత్తూరు డీఎస్పీ రవికుమార్, సీఐ సురేంద్రనాయుడు బాధితులతో మాట్లాడి న్యాయం చేస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు.

వైఎస్సార్‌సీపీలో నియామకం


జ్ఞానజగదీష్

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియామకం చేపట్టారు. మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా చిత్తూరు సంతపేటకు చెందిన జ్ఞాన జగదీష్‌ను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. ఈ మేరకు గురువారం ఆయనకు ఉత్తర్వులు అందాయి.

ఏసీబీ దాడులంటూ పుకార్లు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏసీబీ అధికారులు దాడులు చేస్తున్నారంటూ నగరంలో పుకార్లు వ్యాపించాయి. వార్త సేకరణకు మీడియా ప్రతినిధులు కార్యాలయానికి వెళ్లారు. తీరా అక్కడికి వెళ్లాక ఆ వార్త కేవలం ప్రచారమని తెలిసింది. అలాగే బుధవారం పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు దాడులు చేశారనే పుకార్లు వచ్చాయి. ఇందులోనూ వాస్తవం లేదని తేలింది. మూడు రోజుల క్రితం ఇంటెలిజెన్స్ అధికారులు పీఆర్ కార్యాలయానికి వెళ్లి వారికి అవసరమైన వివరాలు తీసుకున్నారు. తర్వాత ఏసీబీ దాడులని అసత్య వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. దీనిపై ఏసీబీ, జెడ్పీ కార్యాలయాల అధికారులను సంప్రదిస్తే అలాంటివేమీ లేదని స్పష్టం చేశారు.

చెరుకు ట్రాక్టర్ బోల్తా

కార్వేటినగరం: చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిలోని కుప్పానిగుంట నగరవనం వద్ద గురువారం రోడ్డుకు అడ్డంగా చెరుకు ట్రాక్టర్ బోల్తా పడింది. స్థానికుల కథనం మేరకు.. పుత్తూరు నుంచి శ్రీరంగరాజపురం మండలంలోని సాగర్ షుగర్ ఫ్యాక్టరీకి అధిక లోడ్డుతో చెరుకు తరలిస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డుపై బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్ అప్రమత్తంగా తప్పించుకున్నాడు. రోడ్డుకు అడ్డంగా చెరుకు పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ అరెస్టు

–16 పోలీస్‌స్టేషన్లలో 31 కేసులు నమోదు


అవినాక్షయ్య అరెస్టు చూపుతున్న ఎస్‌ఐ రాజ్‌కుమార్, సిబ్బంది

కార్వేటినగరం: మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చిత్తూరు ఎస్పీ, నగరి డీఎస్పీ పర్యవేక్షణలో సీఐ హనుమంతప్ప ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మర్డర్, చోరీలు, గంజాయి తదితర కేసుల్లో 16 పోలీస్ స్టేషన్లలో 31 కేసులతో పాటు నాన్ బెయిలబుల్ వారెంట్ కూడా ఉంది. అయితే పోలీసుల కళ్లు కప్పి తిరుగుతున్న నగరి మండలం తెరణి బ్రిడ్జి గ్రామానికి చెందిన బి.సుబ్రమణ్యం కుమారుడు అవినాక్షయ్య(26) ఊతుకోట వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బంది రాజశేఖర్, లోకనాథం, యువరాజ్ తదితరులు దాడులు చేసి, అరెస్టు చేసి పుత్తూరు కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. అతని అరెస్టులో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఎస్పీ మణికంఠ చందోలు అభినందించినట్లు తెలిపారు.

సైనికుల సేవలు ఎనలేనివి

చిత్తూరు కలెక్టరేట్ : దేశం కోసం ప్రాణాలు అర్పించి, సేవలందించిన సైనికుల సేవలు ఎన్నటికీ మరువలేనివని రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ అధికారి బ్రిగేడియల్ వీవీ రెడ్డి అన్నారు. గురువారం ఆయన జిల్లాలో పర్యటించారు. తొలుత జిల్లా కేంద్రంలోని గిరింపేటలో ఉన్న సైనిక సంక్షేమ శాఖ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వీరనారిమణులకు అందించే ఆర్థిక సహాయం చెక్కులను సంబంధిత కుటుంబాల వద్దకు వెళ్లి అందజేశారు. ఆయన మాట్లాడుతూ దేశసేవలో ఉంటూ మృతి చెందిన సైనికుల వీరనారిమణులకు ప్రభుత్వం తరఫున ఒక్కొక్కరికి రూ.లక్ష అందించినట్లు తెలిపారు. జిల్లాలో ముగ్గురికి రూ.3 లక్షల ఆర్థిక సహాయం చెక్కులను అందించామన్నారు. జిల్లాలోని మురకంబట్టులో ఉన్న దివంగత మాజీ సైనికుడు చంద్రశేఖర్‌రెడ్డి భార్య కుసుమ, ఓటి చెరువు గ్రామానికి చెందిన దివంగత మాజీ సైనికుడు నవీన్‌కుమార్ భార్య ఉమామహేశ్వరి, బంగారుపాళెం మండలం పామిని వాండ్లఊరుకు చెందిన దివంగత మాజీ సైనికుడు భార్య సరితకు ఆర్థిక సహాయం చెక్కులు అందించినట్లు చెప్పారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో ఉన్న మాజీ సైనికుల భవనం అద్దె భవనంలో ఉన్నందున ప్రభుత్వ స్థలం పరిశీలించినట్లు తెలిపారు. జిల్లా ప్రభుత్వ కార్యాలయ నిర్మాణానికి కేంద్రం 50 శాతం, రాష్ట్రం 50 శాతం నిధులు మంజూరు చేస్తుందన్నారు. అనంతరం జిల్లా కార్యాలయంలో మాజీ సైనికులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి రాఘవులు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బీవీ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే చెత్త సేకరణ సాధ్యం


అరగొండ కొత్త బస్టాండులో అధికారుల మానవహారం

తవణంపల్లె: ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారానే ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణ సాధ్యమవుతుందని జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు తెలిపారు. గురువారం మండలంలోని అరగొండలో చెత్త సంపద కేంద్రాల నిర్వహణ, చెత్త నుంచి సంపద తయారీ, ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణ ఎలా అనే అంశాలపై చిత్తూరు, తవణంపల్లె, ఐరాల, యాదమరి, పూతలపట్టు, బంగారుపాళెం, గంగాధరనెల్లూరు, గుడిపాల మండలాల్లోని ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్ల నిర్వహణ బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని సూచించారు. డీపీఓ సుధాకర్‌రావు మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రాలను పంచాయతీ కార్యదర్శులే నిర్వహించాల్సిన ఉందన్నారు. చెత్త సేకరణకు ఉన్న మూడు చక్రాల ఆటోలకు బదులు ఈ ఆటోలు ఇవ్వడానికి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళగా సుముఖత వ్యక్తం చేశారని పేర్కొన్నారు. జిల్లాలో ఐదుగురు ఈఓపీఆర్డీలకు, 9 మంది ఏఓలకు ఎంపీడీఓలుగా పదోన్నతి కల్పిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం అరగొండ కొత్త బస్టాండుతో అవగాహన కలిస్తూ మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీపీఆర్సీ షణ్ముగరామ్, ఎంపీడీఓ రెడ్డిబాబు, సర్పంచ్ మల్లుదొరై, ప్రశాంతకుమార్, ఈఓపీఆర్డీలు రాఘవేంద్రరాజు, హరిప్రసాద్‌రెడ్డి, అరగొండ పంచాయతీ కార్యదర్శి మురుగేషన్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మట్టి దందా

జేసీబీ, ట్రాక్టర్ల సీజ్

గంగవరం: చెరువులో యథేచ్ఛగా కొనసాగుతున్న అక్రమ మట్టి దందాను గురువారం పోలీసులు అడ్డుకుని టీడీపీ నాయకుడికి చెందిన జేసీబీ, రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి, స్టేషన్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు.. గంగవరం మండలంలోని చిన్నూరు గ్రామం వద్ద ఉన్న వంకాయల చెరువులో టీడీపీకి చెందిన చిట్టిబాబు కొన్నాళ్లుగా అక్రమంగా మట్టి వ్యాపారానికి పాల్పడడమే పనిగా పెట్టుకున్నారు. చెరువులో జేసీబీతో మట్టిని తవ్వి ట్రాక్టర్ల ద్వారా రియల్ ఎస్టేట్, ఇటుక బట్టీలకు తరలించి రూ.లక్షల్లో ఆదాయం గడిస్తున్నాడు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని తరలించకూడదనే నిబంధనలున్నా వాటిని ఉల్లంఘించి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఈ వ్యాపారం అతనికి మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతోంది. రహస్య సమాచారం మేరకు పోలీసులు చెరువులో మట్టి తవ్వకాలపై దాడులు జరిపి జేసీబీతో పాటు రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తదుపరి చర్యల కోసం మైన్స్, రెవెన్యూ అధికారులకు బదిలీ చేసినట్టు పోలీసులు తెలిపారు.

స్కూటర్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరి మృతి


ఘటనా స్థలంలో రవి మృతదేహం

చిత్తూరు అర్బన్: నగరంలో గురువారం స్కూటర్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో కె.రవి అలియాస్ చిన్న (51), జయకుమార్ (54) అనే ఇద్దరు మృతి చెందారు. ట్రాఫిక్ సీఐ నిత్యబాబు కథనం మేరకు.. విజయవాడకు చెందిన విశాల్ కుండలిక్ విజయవాడలో వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపార నిమత్తమై రెండు రోజుల క్రితం విజయవాడ నుంచి కొయంబత్తూరు వెళ్లాడు. ఆ వెంటనే అక్కడి నుంచి తిరిగి విజయవాడకు కారులో తనే డ్రైవ్ చేసుకుంటూ బయలుదేరాడు. గురువారం ఉదయం చిత్తూరులోని ఇరువారం కూడలి వద్ద చిత్తూరు శంకరయ్యగుంటకు చెందిన జయకుమార్ జంగాలపల్లె వద్దకు కొయ్య పాలిష్ పని కోసం తన స్నేహితుడు రవితో కలిసి ద్విచక్రవాహనంలో వెళుతుండగా విశాల్ అతివేగంతో కారు నడిపి వారి స్కూటర్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో రవి అక్కడికక్కడే మృతి చెందగా.. జయకుమార్ చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాలకు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుల్లో రవికి ఐదుగురు, జయకుమార్‌కు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు.

మహిళలకు ఆత్మస్థైర్యం ముఖ్యం


క్రీడాపోటీలను పర్యవేక్షిస్తున్న పీడీ శ్రీదేవి

చిత్తూరు కలెక్టరేట్ : మహిళలకు ఆత్మస్థైర్యం ఎంతో ముఖ్యమని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి అన్నారు. గురువారం జిల్లా సమాఖ్య కార్యాలయం ప్రాంగణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు క్రీడాపోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా జిల్లాలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి కుటుంబంలో ఒక మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలనే లక్ష్యంగా సేవలందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్వయం సహాయక సంఘాల ఏర్పాటుతో మహిళల జీవన స్థితిగతులు మెరుగుపడినట్లు తెలిపారు. ఈ నెల 8వ తేదీన నిర్వహించే మహిళా దినోత్సవంలో మహిళలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం సుబ్బారెడ్డి, జిల్లా సమాఖ్య ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు ఈ–సైకిల్ ఎంతో ఉపయోగం


ఈ సైకిళ్లు పంపిణీ చేస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం: సూక్ష్మ, చిన్నతరహా మహిళా వ్యాపారులకు ఈ–సైకిళ్లు ఎంతో ఉపయోగపడుతాయని కడా పీడీ వికాస్ మర్మత్ అన్నారు. గురువారం కుప్పం పట్టణంలో ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థ సమన్వయంతో మహిళలకు విద్యుత్ సైకిళ్లు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఎంతో ఈ– సైకిళ్లు ఉపయోగపడుతాయన్నారు. మొదటి దశగా కుప్పం నియోజకవర్గంలో 50 మంది మహిళలకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సాధారణంగా ఈ సైకిల్ మార్కెట్‌లో రూ.40 వేలు ధర పలుకుతుందని, మహిళలకు కేవలం రూ.9,450కు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో అందరికి ఈ–సైకిళ్లు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబీకులున్నట్లైతే సంప్రదించండి


కార్తీక్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని సంజ్యోత్ బాలల పరిరక్షణ కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న బాలుడు కార్తీక్ తల్లిదండ్రులు, కుటుంబీకులున్నట్లైతే సంప్రదించాలని జిల్లా ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి పేర్కొన్నారు. ఆమె గురువారం ఓ పత్రికా ప్రకటనలో పలు వివరాలు వెల్లడించారు. 6 ఏళ్ల 5 నెలల వయస్సు గల కార్తీక్ అనే బాలుడు చౌడేపల్లి మండలం పుదిపట్ల గ్రామంలో ఉండే సంజ్యోత్ బాలల పరిరక్షణ కేంద్రంలో ఆశ్రయం పొందుతున్నట్లు పేర్కొన్నారు. ఆ బాలుడి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు ఎవరో తెలియదన్నారు. బాలుడి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులున్నట్లైతే 30 రోజుల్లోపు జిల్లా ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. లేని పక్షంలో కార్తీక్‌ను అనాథగా ప్రకటించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం మరొకరికి చట్టబద్ధంగా దత్తత ఇవ్వడం జరుగుతుందని పీడీ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

హెల్మెట్ ధరించండి

గుడిపాల: ద్విచక్ర వాహనచోదకులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి భారతి తెలిపారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం అరుల్‌పురం గ్రామంలో స్వచ్ఛంద నిర్వాహకులు డాక్టర్ జాషువాతో కలిసి పేదలకు హెల్మెట్లు పంపిణీ, హెల్మెట్ వాడకంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో 90 శాతం మంది ద్విచక్ర వాహనచోదకులకే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రమాదాల్లో ఎవరైతే మరణిస్తున్నారో వారి ప్రాణాలే కాకుండా కుటుంబంలో వారిపై ఆధారపడి జీవిస్తున్న వారి జీవితాలను కాపాడాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. ఎన్‌జీఓలు ముందుకు వచ్చి 300 మంది పేదలకు హెల్మెట్లు పంపిణీ చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు.

ద్విచక్రవాహనం దగ్ధం


బంగారుపాళెం: పాలేరు వద్ద జాతీయ రహదారిపై దగ్ధమవుతున్న స్కూటీ



గాయపడిన భార్యాభర్తలు

బంగారుపాళెం: మండలంలోని పాలేరు ఫ్లైఓవర్ల వద్ద బెంగళూరు–చెన్నై జాతీయ రహదారిపై గురువారం మధ్యాహ్నం ద్విచక్రవాహనం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో స్కూటీపై ప్రయాణిస్తున్న భార్యాభర్తలు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. పలమనేరు పట్టణం కాకాతోపు గ్రామానికి చెందిన రామమూర్తి, ఆయన భార్య గీతాంజలి స్కూటీపై చిత్తూరులో కుమారై ఇంటికి బయలుదేరారు. మార్గం మధ్యలో పాలేరు ఫ్లైఓవర్ వద్దకు వచ్చే సరికి స్కూటీ వెనుక వైపు టైరు పేలడంతో ద్విచక్రవాహనం అదుపు తప్పి, భార్యాభర్తలు కిందపడ్డారు. దీంతో వీరిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్కూటీకి మంటలు వ్యాపించి పూర్తిగా కాయిపోయింది. ఆ మార్గంలో ప్రయాణించే వాహనచోదకులు, స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. గాయ పడిన వారిని ఆటోలో బంగారుపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చీలాపల్లె సీఎంసీకి సిఫార్సు చేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.